క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మిర్యాలగూడ అర్బన్ : పట్టణంలోని ఎఫ్‌సీఐ వద్ద గల 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో మెయింటెనెన్స్ పనుల్లో భాగంగా నూతన బ్రేకర్ ఎరెక్షన్ చేపడుతున్నందున మిర్యాలగూడ పట్టణంలోని పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈ రవీందర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమాన్‌పేట ఫీడర్ కింద గల రెడ్డి కాలనీ, జీవీమాల్, హనుమాన్‌పేట, వర్షిత హాస్పిటల్ వీధి, ఎఫ్‌సీఐ ఫీడర్ కింద ఉన్న ఇండస్ట్రియల్ ఏరియాతో పాటు బాపూజీనగర్, ప్రకాశ్‌నగర్, చింతపల్లి ప్రాంతానికి విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ముమ్మరంగా నల్లా బిల్లుల వసూలు


మిర్యాలగూడలో నీటి పన్ను బిల్లులు అందజేస్తున్న సిబ్బంది

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ మున్సిపాలిటీ పరిధిలో వివిధ వార్డుల్లో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ ఆదేశాల మేరకు నీటి విభాగం సిబ్బంది ముమ్మరంగా నల్లా బిల్లులను వసూలు చేశారు. బకాయిదారుల ఇంటి వద్దకు వెళ్లి పెండింగ్ బకాయిలతో పాటు ప్రస్తుత బిల్లులు చెల్లించాలని కోరుతున్నారు. కార్యక్రమంలో నీటి విభాగం సిబ్బంది కె.శ్రీనివాసులు, బి.కోటయ్య, ఎం.జానయ్య, వి.శ్రీనివాస్‌రావు, కె.పరశురాములు, ఎస్.పరశురాములు, ఎస్‌కె.సాధిక్ తదితరులున్నారు.

రమాదేవికి సన్మానం


రమాదేవిని సన్మానిస్తున్న సాయిబాబా టెంపుల్ కమిటీ సభ్యులు

మిర్యాలగూడటౌన్ : పట్టణంలోని హనుమాన్‌పేట కౌన్సిలర్ చిలుకూరి రమాదేవిశ్యామ్ పదవీ కాలం ముగియడంతో శుక్రవారం స్థానికంగా సాయిబాబా టెంపుల్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, స్థానికులు పద్మశెట్టి కోటేశ్వర్‌రావు, కూరపాటి సాంబశివరావు, పద్మ, పెండ్యాల పద్మావతి, పాపిరెడ్డి, సైదులు, రమారావు, సాయి, మహేష్ ఉన్నారు.

క్రీడలతో యువతలో మానసికోల్లాసం


గుర్రంపోడులో విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న సీఐ, ఎస్‌ఐలు

గుర్రంపోడు : క్రీడలతో యువతలో మానసికోల్లాసం కలుగుతుందని సీఐ ధనుంజయ గౌడ్ అన్నారు. మిషన్ పరివర్తన్ -యువతేజం కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో విజేతలకు శుక్రవారం బహుమతులు అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ మధు, కళాశాల ప్రిన్సిపాల్ రాగిణి, పీఈటీ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఏర్పాట్ల పరిశీలన

అడవిదేవులపల్లి: అడవిదేవులపల్లి గ్రామ శివారులో గల కృష్ణానది తీరంలో గల బౌద్ధమ ఆలయం వద్ద ఈనెల 26న జరిగే మహాశివరాత్రి వేడుకల సందర్భంగా శుక్రవారం అధికారులు ఏర్పాట్లను పరిశీలించారు. వాహనదారుల కోసం పార్కింగ్ స్థలాన్ని కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రమేష్, ఎస్‌ఐ శేఖర్, ఆర్‌ఐ శ్యాంలు మాట్లాడుతూ భక్తులకు అసౌకర్యం కలుగకుండా ప్రత్యేక చర్యలను చేపడుతున్నామని అన్నారు.

అప్పు తీసుకుని బెదిరిస్తున్న దంపతులపై ఫిర్యాదు

మిర్యాలగూడ అర్బన్: అప్పు తీసుకుని తిరిగి ఇవ్వకుండా బెదిరింపులకు పాల్పడుతున్న దంపతులపై బాధితుడు శుక్రవారం మిర్యాలగూడ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాలప్రకారం.. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా బోడుప్పల్ వెస్ట్ బాలాజీహిల్స్ కాలనీకి చెందిన కొమ్ము జాన్‌వెస్లీ నుంచి మిర్యాలగూడ పట్టణంలోని ఈదులగూడ కాలనీకి చెందిన జంపాల సాంబశివరావు, అంజమ్మ దంపతులు మెడికల్ షాపు పెట్టుకునేందుకు రూ.12లక్షలు అప్పు తీసుకున్నారు. తీసుకున్న అప్పు చెల్లించాలని జాన్‌వెస్లీ పలుమార్లు సాంబశివరావు, అంజమ్మ దంపతులను అడగగా.. వారు ఇవ్వకపోగా, చంపుతామని బెదిరింపులకు దిగుతున్నారని, డబ్బుల కోసం ఇంటికి వెళ్లిన తనపై దొంగతనం కేసు పెట్టి వేధిపులకు గురిచేస్తున్నారని జాన్‌వెస్లీ మిర్యాలగూడ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఎస్‌ఐ సైదిరెడ్డి తెలిపారు.

ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

- నేటి నుంచి మారేపల్లిలో శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు
- పది రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు


బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన ఆలయం


కొలువై ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామి

హాలియా : అనుముల మండలంలోని మారేపల్లి గ్రామంలో ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. నిర్వాహకులు ఈ వేడుకలకు ఆలయాన్ని ముస్తాబు చేశారు. 450 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ ఆలయంలో పది రోజుల పాటు బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. త్రిదండి శ్రీ మన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి మంగళ శాసనముల ఆధ్వర్యంలో నేటి (7వ తేదీ) నుంచి 16వ తేదీ వరకు తిరుకల్యాణం, రథోత్సవం, హోమం, బలిహరణం, శతఘటాభిషేకం, విష్ణు సహస్రనామ పారాయణం, దోపోత్సవం, అశ్వవాహన సేవ, పూర్ణహుతి, నవకళశాభిషేకం, చక్రతీర్థం, విశ్వక్సేనారాధన, పుణ్యహవాచనమ్, పంచగవ్యప్రాశనం, దీక్షాస్వీకారం, అంకురార్పణ, వాస్తుహోమం, గరుడ సేవ, ధ్వజపటాధివాసం, ధ్వజారోహణం, గరుడ ముద్ద, మహాపూర్ణాహుతి, అలివేలుమంగ సమేత శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణం తదితర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని నిర్వాహకులు కోరారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు

- ఏఎస్పీ మౌనిక


చింతపల్లి లో క్రీడలు ప్రారంభిస్తున్న ఏఎస్పీ

చింతపల్లి: చదువుతో పాటు క్రీడల్లో రాణించే వారికి ఉజ్వల భవిషత్తు ఉంటుందని దేవరకొండ ఏఎస్పీ మౌనిక అన్నారు. చింతపల్లి మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన మండల స్థాయి కబడ్డీ పోటీలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. చిన్నతనం నుంచే గెలుపు ఓటములను అలవర్చుకుంటే జీవితంలో ఎలాంటి ఒడిదొడుకులు వచ్చినా తట్టుకునే అవకాశం ఉంటుందన్నారు. ప్రణవ గ్రూప్ ఆఫ్ చైర్మన్ బూర్గు రవి జ్ఞాపికలను, క్రీడాకారులకు జెర్సీలను అందజేశారు. విజేతలకు సీఐ నవీన్ కుమార్, చింతపల్లి ఎస్‌ఐ యాదయ్య బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రమాకాంత్ శర్మ, ఎంఈఓ నీరుడు అంజయ్య, ఎంపీడీవో సుజాత, వివిధ పాఠశాలల పీడీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలతో హక్కులు సాధించుకోవాలి


మార్కండేయ పూజ నిర్వహిస్తున్న పద్మశాలీలు

మిర్యాలగూడ టౌన్: పద్మశాలీలు ఐక్యంగా పోరాడుతూ హక్కులను సాధించుకోవాలని పద్మశాలి సంఘం మిర్యాలగూడ అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడు పిల్లలమర్రి రవికుమార్, శాశ్వత గౌరవ అధ్యక్షుడు తిరందాసు వేణుగోపాల్ అన్నారు. శుక్రవారం మిర్యాలగూడ పట్టణంలోని ఎన్ఎస్‌పీ క్యాంపులో గల మహాత్మాజ్యోతిరావుపూలే బీసీ భవనంలో జరిగిన సంఘం సమావేశంలో వారు మాట్లాడారు. అంతకుముందు పద్మశాలీల కుల దైవం మృత్యుంజయుడు మార్కొండేయ స్వామి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు చెరుపల్లి పట్టాభి రామయ్య, చిట్టిపోలు రమేష్, చిలువేరు బిక్షం, కోలా సైదులు, కంచి సత్యనారాయణ, దాసరాజు జయరాజ్, మురళియాదవ్, ఈశ్వరాచారి, రావిరాల ప్రకాశ్, నాగభూషణం, సైదులు, సత్య తదితరులున్నారు.

పెన్షనర్లకు ఆదాయ పన్ను రద్దుచేయాలి


మాట్లాడుతున్న జేఏసీ నాయకులు

మిర్యాలగూడ అర్బన్ : పెన్షనర్లకు ఆదాయ పన్ను రద్దు చేయాలనిబీసీ ఉద్యోగులజేఏసీ నాయకుడు మారం శ్రీనివాస్, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకుడు తుముల నారాయణ అన్నారు. శుక్రవారం మిర్యాలగూడ పట్టణంలోని విద్యుత్ ఉద్యోగుల కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. దాదాపు 30 ఏళ్లు ఉద్యోగులు ఇన్‌కమ్ ట్యాక్స్ చెల్లిస్తారని తెలిపారు. కానీ రిటైర్డు తరువాత వచ్చే జీవన భృతిని ఆదాయం కింద ఎలా చూస్తారని ప్రశ్నించారు. కోర్టులు ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకుని సుమోటో కేసుగా తీసుకొని రిటైర్డ్ ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు ఆంజనేయులు, షఫీ, విజ్‌కుమార్, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు నామిరెడ్డి దయాకర్‌రెడ్డి, సల్మాన్, గుడిసెల ముత్తయ్య, రామ్‌రెడ్డి, పర్వతాలు, రాంబాబు, వీరభద్రరావు, శివ, రాజేశ్వర్‌రావు, రవీందర్, కృష్ణారావు, రామారావు పాల్గొన్నారు.

జడ్చర్ల రహదారిపై టోల్‌గేట్ ప్రారంభం

మిర్యాలగూడ : కోదాడ- జడ్చర్ల జాతీయ రహదారిపై ఆలగడప వద్ద ఏర్పాటు చేసిన టోల్‌గేట్‌ను శుక్రవారం నేషనల్ హైవే ఇంజనీర్ తేజారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేట్ హైవేలా కాకుండా 20కి.మీ పరిధిలోని ప్రాంతాల వారు కమర్షియల్ వాహనాలకు పాస్‌ల కోసం నెలకు రూ.340 చెల్లించాల్సి ఉంటుందన్నారు. నాన్ కమర్షియల్ వాహనాలకు ఉచిత ప్రవేశం ఉంటుందన్నారు. అయితే, రోడ్డు పూర్తికాకుండానే టోల్ వసూలు చేయడం చట్టవిరుద్ధమని స్థానికులు ఆరోపిస్తున్నారు. 7కి.మీ దూరం కూడా లేని సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలానికి పలురకాల పనులపై తరుచుగా స్థానికులు వెళ్తుంటారని, అందుకోసం నెలకు రూ.340 వసూలు చేయడం అన్యాయమని అంటున్నారు.

గ్రామీణ ప్రజలను మోసం చేస్తున్నారు.

గ్రామీణ ప్రజలను ప్రభుత్వం మోసం చేస్తుందని మట్టి మనిషి వేదిక కన్వీనర్ వేనేపల్లి పాండురంగారావు అన్నారు. గతంలో మాదిరిగానే 20కి.మీ వరకు లోకల్ వారికి ఉచిత ప్రయాణం కల్పిస్తామని చెబుతూ వచ్చారని, ఇప్పుడు చార్జీలు వేస్తామని ప్రకటించడం సరికాదన్నారు.

కుల గణన సర్వే రిపోర్టును పునఃసమీక్షించాలి


వినతి పత్రం అందజేస్తున్న బీసీ సంఘం నాయకులు

మిర్యాలగూడ టౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన సమగ్ర కుల గణన సర్వే రిపోర్టును పునఃసమీక్షించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ కోరారు. ఈ మేరకు శుక్రవారం మిర్యాలగూడలో ఆ సంఘం ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర కుల గణన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను మోసం చేసిందన్నారు. 56శాతం ఉన్న బీసీలను తక్కువ లెక్కలను చూపిస్తూ అగ్ర వర్ణాలను ఎక్కువ శాతం చూపించడం విడ్డురంగా ఉందన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు బంటు వెంకటేశ్వర్లు, దోనేటి శేఖర్, నక్క నాగరాజు తదితరులున్నారు.

యువత పట్టుదలతో చదవాలి


పుస్తకాలు అందజేస్తున్న తహసీల్దార్


పరీక్ష సామగ్రి అందిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

మిర్యాలగూడ టౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ ఉద్యోగాలకు నోటిషికేషన్లు విడుదల చేస్తున్నందున నిరుద్యోగ యువత పట్టుదలతో చదివి లక్ష్యాన్ని చేరుకోవాలని మిర్యాలగూడ తహసీల్దార్ హరిబాబు అన్నారు. శుక్రవారం లయన్స్‌క్లబ్ ఆఫ్ భాస్కరా క్లబ్ నుంచి చాటర్ ప్రెసిడెంట్ మురారీ-భాగ్యలక్ష్మి కుమారుడు రాఘవేంద్ర పుట్టిన రోజు సందర్భంగా గ్రంథాలయానికి ఎంఈఓ బాలునాయక్, క్లబ్ అధ్యక్షుడు లింగయ్యలతో కలిసి అల్పాహారం, పండ్లు పంపిణీ చేయగా శ్రీనివాస చౌదరి ఆధ్వర్యంలో పుస్తకాలను బహూకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు బీఎం నాయుడు, దివ్యాంగుల క్లబ్ అధ్యక్షుడు సింగు రాంబాబు, కోల సైదులు, సేవిత శ్రీనివాస్, డాక్టర్ జాడి రాజు, సింగరికొండ ప్రసాద్, గట్టు వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

గుర్రంపోడు : మండలంలోని కొప్పోలు, నడికూడ, పిట్టలగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల పదవ తరగతి విద్యార్థులకు శుక్రవారం లయన్స్ క్లబ్ గెలాక్సీ ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రి అందించారు. లయన్స్ క్లబ్ సభ్యుడు బుర్రి భూపతిరెడ్డి కుమారుడు వెంకట్రామ్ రెడ్డి అందించిన ఆర్థిక సహకారంతో పరీక్ష సామగ్రిని సమకూర్చారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి నోముల యాదగిరి, గెలాక్సీ క్లబ్ అధ్యక్షుడు మారెడ్డి వెంకట్ రెడ్డి, గడ్డం ప్రదీప్ రెడ్డి, వద్దిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, విజయ్‌పాల్ రెడ్డి, బుర్రి నాగిరెడ్డి, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు ఎన్. యాదయ్య, క్షేత్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు

పెద్దఅడిశర్లపల్లి : మండలంలోని బాలాజీనగర్‌లో శ్రీబాలాజీ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు శుక్రవారం ముగిశాయి. మొత్తం 32 జట్లు పాల్గొన్న ఈ టోర్నీలో మొదటి బహుమతిని బాలాజీనగర్ జట్టు, ద్వితీయ బహుమతిని నందిపాడు జట్టు గెలుచుకున్నాయి.


ప్రథమ బహుమతి పొందిన బాలాజీనగర్ జట్టు

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఎంచుకోవాలి


ఉద్యోగాల నమోదులో కళాశాల విద్యార్థులు

దేవరకొండ: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఎంచుకొని వాటిని చేరుకోవాలని దేవరకొండ ఎంకేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రమావత్ రవినాయక్ అన్నారు. శుక్రవారం కళాశాలలో తెలంగాణ స్కిల్స్, నాలెడ్జ్ సెంటర్(టీఎస్‌కేసీ) ఆధ్వర్యంలో డీఈఈటీ (డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ) ఉద్యోగార్థుల నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఉన్నత విద్య అనంతరం విద్యార్థులకు ఉద్యోగాల కల్పనకు గాను ఈ అవకాశం ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చేతివృత్తుల బలోపేతానికే విశ్వకర్మ యోజన


మిర్యాలగూడలో కార్పెంటర్లకు పనిముట్లు అందజేస్తున్న చిలుకూరి శ్యామ్

మిర్యాలగూడ టౌన్: చేతివృత్తులను బలోపేతం చేసేందుకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ విశ్వకర్మ యోజన పథకం అమలు చేశారని బీజేపీ నేత, విశ్వకర్మ యోజన పథకం అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ చిలుకూరి శ్యామ్ అన్నారు. మిర్యాలగూడ పట్టణంలో విశ్వకర్మ యోజన పథకం కింద ఉచిత శిక్షణ పొందిన లబ్ధిదారులకు శుక్రవారం ధ్రువీకరణ పత్రాలతో పాటు హనుమాపేట కార్పెంటర్ మధుచారికి మంజూరైన పనిముట్ల కిట్టును పంపిణీ చేసి మాట్లాడారు. ఈ పథకం 2028 వరకు కొనసాగుతుందని, ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు తుమ్మలపల్లి హన్మంతరెడ్డి, కార్పెంటర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు మల్లికార్జున చారి, రామాచారి, విశ్వకర్మ నాయకులు గడగోజు చంద్రశేఖర్, చేర్యాల వెంకటాచారి, మండలోజు సైదాచారి, హనుమాచారి, సాంబశివరావు, రామారావు, వెంకటాచారి, నాగాచారి పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మహాసభల కరపత్రం ఆవిష్కరణ

చింతపల్లి : నల్లగొండలో ఈ నెల 17, 18 తేదీల్లో జరిగే భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) జిల్లా 45వ మహాసభలను విజయవంతం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు రామావత్ లక్ష్మణ్, బుడిగ వెంకటేష్ కోరారు. శుక్రవారం మహాసభల కరపత్రాలను మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో విడుదల చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను పట్టించుకోవడం లేదని, మూడు సంవత్సరాల నుంచి స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ రావడం లేదన్నారు. విద్యార్థుల సమస్యలపై మహాసభల్లో చర్చించి భవిష్యత్ పోరాటాలకు సిద్ధమవుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయులు, మనోజ్, గురు, శ్రీకాంత్, కవిత, శారద, స్వాతి, మౌనిక, త్రిష తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి సన్మానం

పెద్దవూర : బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా రెండవసారి నియమితులైన నాగం వర్షిత్‌రెడ్డిని శుక్రవారం మండల బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కంభంపాటి కృష్ణ, పాల్తీ శంకర్‌నాయక్, మండల ప్రధాన కార్యదర్శి చిట్టిమల్ల సురేష్, పల్లెబోయిన ఆంజనేయులు, జూలకంటి మట్టారెడ్డి, కుంటిగొర్ల రాజశేఖర్, రమావత్ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం


ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

దేవరకొండ: మాల మహానాడు ఆధ్వర్యంలో శుక్రవారం దేవరకొండ పట్టణంలోని ప్రధాన రహదారిపై రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షుడు బోయిని చంద్రమౌళి మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణపై ఏకసభ్య కమిషన్ ఇచ్చిన రిపోర్టు అశాస్త్రీయంగా ఉందన్నారు. సుప్రీం కోర్టు తీర్పుకు విరుద్ధంగా వర్గీకరణ చేపట్టారని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి అండగా నిలబడిన మాలలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మోసం చేసిందన్నారు. మోదీ, చంద్రబాబు మెప్పు కోసమే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దళితులను విభజిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా కోఆర్డినేటర్ ఏకుల రాజారావు, నాయకులు చెన్నయ్య, చలిచీమల పర్వతాలు, నారిమళ్ల మల్లేష్, ఆంజనేయులు, భాస్కర్, శ్రీనయ్య, ప్రసన్నకుమార్, అంజి తదితరులున్నారు.

రైతులు శాస్త్రవేత్తల సూచనలు పాటించాలి


పూసలపాడులో వరి చేలను పరిశీలిస్తున్న ఏడీ శివరామ్‌కుమార్

వేములపల్లి(మాడ్గులపల్లి) : రైతులు యాసంగి సీజన్‌లో కంపాసాగర్ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తల సూచనలను పాటించి స్వల్పకాలిక విత్తన రకాలను ఎంచుకుని నారు పోసిన 20- 25 రోజుల్లోనే నాట్లు వేయాలని ఏడీ ఎం.శివరామ్‌కుమార్ సూచించారు. మాడ్గులపల్లి మండలంలోని పూసలపాడు, కన్నెకల్ గ్రామాల్లో రైతులు సాగు చేసిన వరి చేలను ఏడీ వరామ్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ.. పొలాలు ముందస్తుగా పొట్ట దశకు చేరుకుంటున్నాయని తమ దృష్టికి రావడంతో పరిశీలించినట్లు తెలిపారు. నవంబర్ 15 నుంచి డిసెంబర్ 20 మధ్య నారు పోయడానికి అనుకూలమని, కానీ ముందుగా నారు పోయడంతో పిలక దశలో చలి తీవ్రత కారణంగా పైరు సరిగ్గా ఎదగక తల్లి కర్ర ముందుగా ఈనుతుందన్నారు. చివరగా దమ్ము చేసినప్పుడు డీఏపీని వేసిన తరువాత యూరియా వేయకపోవడం వల్ల కూడా తల్లి కర్ర ముందుగా ఈనుతుందన్నారు. తల్లి కర్ర ముందుగా ఈనితే బూస్టర్ డోస్‌గా ఎకరానికి 30- 36 కిలోల యూరియా వేసుకోవాలని, ఒకవేళ రైతులు రెండో దఫా యూరియా వేసినట్లయితే వెంటనే 2, 3 దఫాల్లో యూరియా కలిపి వేయాలని సూచించారు. జింక్ లోపం ఉంటే రెండు గ్రాముల జింక్ సల్ఫేట్‌ను లీటర్ నీటిలో కలిపి పది రోజుల్లో రెండుమార్లు పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు గోపాల్, శిరీష, పార్వతి, రైతులు పాల్గొన్నారు.

108 సేవలు సద్వినియోగం చేసుకోవాలి


వైద్యసేవలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

త్రిపురారం: మండలంలోని త్రిపురారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కేటాయించిన 108 సేవలను గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల వైద్యాధికారి డాక్టర్ శంకర్ నాయక్ సూచించారు. శుక్రవారం త్రిపురారంలోని పీహెచ్‌సీలో 108 వాహనంలో అత్యవసరంగా నిర్వహించే పరికరాలు, వాటి పనితీరు, ప్రజలకు అందిచాల్సిన వైద్యసేవలపై 108 సిబ్బందితో కలిసి ఆశా వర్కర్లు, వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ శంకర్‌నాయక్ మాట్లాడారు. అనంతరం సెంటర్ ఫర్ ఫైనాన్సియల్ లిట్రసీ కార్యక్రమంలో భాగంగా ఆర్థిక అక్షరాస్యతపై ఆశా వర్కర్లకు బ్యాంక్ సిబ్బంది అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీబీ కంట్రోల్ అధికారి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, పుట్ట గోపాల్‌రెడ్డి వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

రమాబాయికి నివాళి


రమాబాయి అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

దేవరకొండ: రమాబాయి అంబేద్కర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకుడు కంబాలపల్లి వెంకటయ్య అన్నారు. శుక్రవారం రమాబాయి అంబేద్కర్ 128వ జయంతిని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. బీఆర్ అంబేద్కర్, రమాబాయి చిత్రపటాలకు పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చొల్లేటి భాస్కరాచారి, ఎర్ర ఆంజనేయులు, అందుగుల సైదులు, జీవ, ఉదయ్ శంకర్ పాల్గొన్నారు.

పౌల్ట్రీ రైతులు అప్రమత్తంగా ఉండాలి


ఇందుగులలో కోళ్ల ఫామ్‌ను పరిశీలిస్తున్న మండల పశువైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్

వేములపల్లి(మాడ్గులపల్లి) : ప్రస్తుతం కోళ్లకు వైరస్ సోకి మృతి చెందుతున్నందున పౌల్ట్రీ రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ ఆర్.వినయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మాడ్గులపల్లి మండలంలోని ఇందుగుల గ్రామంలో గల కోళ్ల ఫామ్‌ను ఆయన పరిశీలించి మాట్లాడారు. అనారోగ్యంగా ఉన్న కోళ్లను గుర్తించి తగిన చికిత్స అందించాలన్నారు. చనిపోయిన కోళ్ల నుంచి ఆరోగ్యకరమైన కోళ్లకు రోగాలు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చనిపోయిన కోళ్లను ఎట్టి పరిస్థితుల్లో కుంటలు, కాల్వలు, బహిరంగ ప్రదేశాల్లో పడవేయద్దన్నారు. కోళ్ల ఫామ్‌ల్లో కోళ్ల మరణిస్తే ఆ సమాచారాన్ని మండల పశువైద్యాధికారులకు తెలపాలన్నారు.

బ్రహ్మోత్సవాలకు వేణుగోపాలుడు ముస్తాబు

- నేటి నుంచి శ్రీ వారిజాల వేణుగోపాలస్వామి ఉత్సవాలు
- 12వ తేదీన స్వామివారి తిరుకల్యాణం


శ్రీవారిజాల వేణుగోపాలస్వామి మూలవిరాట్

నార్కట్‌పల్లి : మండల పరిధిలోని గోపలాయిపల్లి గ్రామ సమీపాన గల శ్రీవారిజాల వేణుగోపాలస్వామి దేవస్థానంలో శనివారం(8వ తేదీ) నుంచి ఈ నెల 17వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. ప్రతీ ఏటా చెర్వుగట్టు బ్రహ్మోత్సవాల ముగింపు దశలో ఈ ఆలయంలో ఉత్సవాలు ప్రారంభం కావడం ఆనవాయితీ. పాంచరాత్రాగమ శాస్త్ర ప్రకారం10 రోజులపాటు ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు దేవస్థాన అనువంశిక చైర్మన్ కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వహణ అధికారి అంబటి నాగిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదిశేషు పడగ నీడన స్వయంభుగా వెలిసిన స్వామివారి ప్రధాన ఆలయంతోపాటు కొండపై గల ఇతర ఉప ఆలయాలు, ఆంజనేయస్వామి, మూలస్వామిగుట్ట, రామలింగేశ్వరస్వామి, ఆలయాలను పుష్పాలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈ ఆలయం గుట్ట సేద తీర్చుకుంటున్న ఆవు మాదిరి ఆకారం పోలి ఉండడంతో దీనిని శ్రీ వారిజాల వేణుగోపాల స్వామి ఆలయంగా పిలుస్తున్నట్లు పూర్వీకుల ద్వారా తెలుస్తోంది. సుమారు 1800 సంవత్సరాల క్రితం మునుల తపశ్శక్తి, ఉపాసన వల్ల స్వయంభు స్వామి కొలువుదీరారని ప్రతీతి.

పుష్కరిణి ప్రత్యేకత

అన్ని కాలాల్లో ఇక్కడి కోనేరులో నీరు సమృద్ధిగా ఉండడం విశేషం. దాని నిండా ఆకులు పరుచుకుని విరబూసిన తామర పూలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటాయి. ఫ్లోరిన్ నీరు ఇక్కడ భూగర్భంలో ఉన్నప్పటికీ ఈ కోనేటి నీరు మాత్రం రుచికరంగా ఉండడం విశేషం.

మంత్రిబావి నీరు పవిత్రం

గుట్టపై ఉన్న దర్శనీయ స్థలాల్లో ఒకటైన మంత్రిబావి మూలస్వామి గుట్ట సమీపంలో ఉంది. ఈ బావిలోని నీటిని మహిమ గల నీరుగా భావిస్తారు. బావిలోని నీరు ఎక్కడి నుంచి వస్తుంది.. ఎక్కడికి పోతుంది.. అనేది అంతుబట్టని విషయం. ఈ నీటిని తాగినట్లయితే మానసిక రుగ్మతులు తొలగిపోతాయని భక్తుల నమ్మకం. గతంలో సమీప రైతులు ఈ నీటిని తమ పంట పొలాలపై చల్లుకునేవారు.

బ్రహ్మోత్సవాలు ఇలా..

ఆలయ బ్రహ్మోత్సవాలను శనివారం ఉదయం శ్రీ విష్ణుసహస్రనామ స్తోత్ర పారాయణంతో శ్రీకారం చుడతారు. 9న ద్రావిడ ప్రబంధ పారాయణం, తీర్థ గోష్ఠి 10న పరమ పదోత్సవం, 11న ధ్వజారోహణ, గరుడముద్ద, చాత్మర అంకురార్పణ, దేవతాహ్వానం, 12న శ్రీ స్వామివారి తిరుకల్యాణోత్సవం, హోమం, బలిహరణ, 13న గరుడ సేవ, బలిహరణం, 14న హనుమంత సేవ, 15న గోపాలాయపల్లి గ్రామ వీధుల్లో గ్రామోత్సవం, గుట్టపైన రాత్రి రథోత్సవము, 16న ఉదయం పూర్ణాహుతి, చక్రతీర్థం, దోపోత్సవం, 17న శతకలశాభిషేకం, ధ్వజపట ఉద్వాసన, శ్రీ పుష్పయాగం, ఏకాంత సేవ, పవళింపు సేవలతో ఉత్సవాలు పరిసమాప్తి అవుతాయి. స్వామివారి తిరుకల్యాణోత్సవం, రథోత్సవం, దోపోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతారు.